నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, సాయిబాబా, శివాజీనగర్, మహంకాళి, డెంటల్ కాలేజ్, లక్ష్మీనర్సింహకాలనీ, బాలాజీనగర్ ప్రధాన రోడ్డు, సంతోష్‌నగర్, సుభద్రమ్మ కాలనీ, భద్రయ్య వెంచర్, సుక్కమ్మ బస్తీ, విఘ్నేశ్వర కాలనీ, శ్రీరామ్‌నగర్, మార్వాడీ లైన్, జ్యోతికాలనీ, భజరంగ్‌కాలనీ, వీకే.ఎన్‌క్లేవ్, కళ్యాణ్ సులోచన, మోహన్‌రావు కాలనీ, ఆనంద్ కాలనీ, శాంతినగర్, ముత్తుస్వామి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బీజేఆర్‌నగర్, చెన్నాపూర్, భగత్‌సింగ్ కాలనీ, వికలాంగుల కాలనీ, సీపీఐ కాలనీ, రావి నారాయణరెడ్డి కాలనీ, డబుల్ బెడ్ రూమ్ అపార్టుమెంట్స్, రిజిస్ట్రేషన్ కాలనీ, రేణుకానగర్, ఫైరింగ్ రేంజ్, మహంకాళీ టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాంబశివరావు తెలిపారు.

బాధితులకు సెల్ ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను కీసర క్రైం టీం, సభ్యులు వెంకటనారాయణ, డిటెక్టివ్ ఎస్ఐ సిబ్బంది, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి నాలుగు సెల్ ఫోన్లను రికవరీ చేశారు. ఆదివారం కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.

మున్సిపల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ప్రేమలత


మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మేడ్చల్ కు చెందిన సీనియర్ నాయకురాలు ప్రేమలత నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆదివారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. మేడ్చల్ మున్సిపాలిటీలో మహిళా కాంగ్రెస్ పటిష్టతకు ,ప్రభుత్వ కార్యక్రమాలు మహిళలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

చీర్యాల ఆలయంలో జైళ్ల శాఖ డీఐజీ పూజలు



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని ఆదివారం వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ సంపత్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

మూర్ఛ వ్యాధితో వ్యవసాయ కూలీ మృతి



గణేష్ మృతదేహం

శామీర్‌పేట్: పొలంలో కూలీ పని చేస్తున్న వ్యక్తి ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామానికి బొగ్గుల గణేష్ (32), వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం అదే గ్రామానికి చెందిన తప్పెట్ల రాములు పొలంలో పని చేసేందుకు వెళ్లిన అతను ఫిట్స్ రావడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శామీర్ పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: శ్రీసాయి రాణా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం మల్లాపూర్ అన్నపూర్ణకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీ ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్ బాబు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందని ద్రాక్షగా ఉన్నత విద్య

అమలుకు నోచని ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు హామీ

- డిగ్రీ కళాశాల లేక పేద విద్యార్థుల అవస్థలు
- ఏటా వేలాది మంది ఉన్నత విద్యకు దూరం
- ఎన్నికల హామీలను పట్టించుకోని నాయకులు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో 6 లక్షలకు పైగా జనాభా ఉన్నా ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మాత్రం మంజూరు చేయడం లేదు. మేడ్చల్ పరిసర ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత చదువు అందని ద్రాక్షగా మారింది. విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఎన్నికల సమయంలో మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తామని ప్రతి పార్టీ హామీ ఇస్తున్నారే తప్ప ఆ తర్వాత దాని ఊసే మరిచిపోతున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యేలు మంత్రులుగా పని చేసినా ఏ నాయకుడు నియోజకవర్గంలో కళాశాలల ఏర్పాటుపై శ్రద్ధ చూపలేదు.

◆ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్, శామీర్‌పేట్ విద్యార్థులతో పాటు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, యాదాద్రి జిల్లాల శివారు మండలాల ప్రాంతాల విద్యార్థులు ఎక్కువగా మేడ్చల్‌లోనే విద్యను అభ్యసిస్తున్నారు. మేడ్చల్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయి. ఉన్నత చదువుల కోసం నగరానికి వెళ్లలేక చదువులు సగంలోనే మానేస్తున్నారు.



డిగ్రీ కళాశాల సాధనకు ధర్నా చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

విద్యార్థుల పోరాటాలు వృథా..

విద్యార్థి సంఘాలు జేఏసీగా ఏర్పడి ఏళ్ల తరబడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధన కోసం పోరాటాలు చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు మంజూరైనా మేడ్చల్‌కు ఒక్కటి కూడా కేటాయించలేదు. రెండు కాలేజీలు ఉప్పల్, రాజేంద్రనగర్‌లకు వెళ్లడంతో మేడ్చల్‌కు భంగపాటు తప్పలేదు. ఈ ఏడాదైనా మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరవుతుందని విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పేద విద్యార్థులకు భారంగా ఉన్నత విద్య.

నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 5 మండలాలు ఉన్నా మేడ్చల్‌లో మినహా ఎక్కడా ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల లేదు. గురుకులాలు ఉన్నా అవి అందరికీ ఉపయోగపడటం లేదు. పేద విద్యార్థులు గ్రామాల నుంచి నగరానికి వెళ్లలేక ప్రైవేట్‌లో ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పట్టుబట్టి చదువుతున్న వారి తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలల దోపిడీకి అప్పుల పాలవుతున్నారు.

20 ఏళ్లుగా పోరాడుతున్నాం..



దాదాపు 20 ఏళ్లుగా మేడ్చల్ లో డిగ్రీ కళాశాల కోసం విద్యార్థి సంఘాలు సంఘటిత పోరాటాలు చేస్తున్నాం . అయినా పాలకులు స్పందించడం లేదు. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థుల రాతలు మారడం లేదు. మేడ్చల్ ప్రాంతంలో డిగ్రీ కళాశాల అంశం ఎన్నికల హామీగా మారింది. ఎన్నికల్లో నిలబడే ప్రతి నాయకుడు తాను గెలవగానే డిగ్రీ కళాశాల తెస్తా అని చెబుతూ గెలిచాక పట్టించుకోవడం లేదు.

– సంతోష్ రాథోడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ఈ ఏడాది సాధిస్తాం..



ఈ సంవత్సరంలో మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో డిగ్రీ కళాశాలలను సాధిస్తాం. ఎన్ఎస్‌యూఐ పోరాటాలు, విద్యార్థి జేఏసీ పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదు. కాంగ్రెస్ అగ్ర నాయకులతో కలిసి ఈ సంవత్సరం మేడ్చల్‌లో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయడంలో సఫలం అవుతామని ఆశిస్తున్నాం.

– రాహుల్‌యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

సీఎం దృష్టికి తీసుకెళ్లాం..



మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, కీసర, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి, కీసరలలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరాం. మేడ్చల్ నియోజకవర్గానికి ఇంటర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని కోరాం..ఈ సంవత్సరం నూతన కళాశాలలు ఏర్పాటు చేస్తామనే హామీ ఇచ్చారు.

– సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

తొమ్మిది శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ తదితరులు

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్యమాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మల్లేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల మాదిగల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. పోరాటంలో అమరులైన కార్యకర్తలకు నివాళులర్పిస్తున్నామని, కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు ఇళ్ల పట్టాలు అందజేయాలన్నారు. సమావేశంలో నరసింహారావు, నరసింహ, ఆంజనేయులు మాదిగ, నర్సింగ్‌రావు మాదిగ, నవీన్‌మాదిగ, నిఖిల్, అంజి, బాబారావు, ఉపేందర్, మధుసూదన్, గణేశ్ పాల్గొన్నారు.

భద్రతపై పోలీసుల అవగాహన

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కాలనీల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కాలనీల్లో తప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురికావొద్దని, కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డయల్ 100, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

సమష్టి కృషితోనే వెట్టి చాకిరి నిర్మూలన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: వెట్టిచాకిరి రహిత తెలంగాణగా తీర్చిదిద్దడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దివ్య దిశ సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి విముక్తిపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, ఎవరు శ్రమదోపిడి ఉచ్చులో పడవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్, నాయకులు బింగి సతీష్‌గౌడ్, లేబర్ యూనియన్ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, నాయకులు యాదయ్య, రాజుయాదవ్, సాయికృష్ణ, నాగరాజు, అరుణ్, ప్రియాంక, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



మాజీ కౌన్సిలర్లను సత్కారిస్తున్న దృశ్యం

కీసర: పదవిలో లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పలువురు మాజీ కౌన్సిలర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇటీవల పదవీ కాలం ముగిసిన నాగారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు గూడూరు సబితాంజనేయులుగౌడ్, కౌకుట్ల అనంత రెడ్డి, కొముర్రెల్లి అనితా సుధాకర్‌రెడ్డిలను ఆదివారం శిల్పానగర్ కాలనీ, గోపికృష్ణకాలనీ, విజయపూరి కాలనీల అసోషియేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సందర్భంగా మాజీ వారు మాట్లాడుతూ గత ఏదేళ్లగా కౌన్సిలర్లుగా కొనసాగుతూ ఆయా వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశామన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసి హైదారాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఝాన్సీ అన్నారు. ఫిబ్రవరి 20న నిర్వహించే ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం జవహర్‌నగర్‌లో మేడ్చల్ డివిజన్ కమిటీ కామ్రేడ్ శివబాబు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే ప్రజా ప్రదర్శన బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి అనురాధ, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు జయసుధ, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్, కార్మికులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ క్లబ్‌కు నిధుల కేటాయింపు

ఉప్పల్: సీనియర్ సిటిజన్‌లకు అండగా ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ సీనియర్ సిటిజన్ క్లబ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 20 లక్షలు కేటాయించడంపై వారు పరమేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ మెయిన్‌రోడ్డులో ఇప్పటికే క్లబ్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. మేకల రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్, మనోహర్, కుమారస్వామి, నారాయణగౌడ్, నర్సింహారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శామీర్‌పేట్: శామీర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000 బ్యాచ్ విద్యార్థులు బొమ్మరాశిపేటలోని లియోనియా రిసార్ట్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. చిన్ననాటి స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు.



జాతీయ సమైక్యత శిబిరంలో సీఎంఆర్ఐటీ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న సీఎంఆర్ఐటీ, జేఎన్‌టీయూహెచ్ బృందం

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏపీలోని నర్సాపురంలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్నారు. వైఎన్ కళాశాలలో జాతీయ సేవా పథకం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శోభారాణి, సీఎంఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ, తెలంగాణ కంటిజెంట్ లీడర్ నిఖిలతో కలిసి విద్యార్థినులు పావని, అలేఖ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్, కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి వారిని అభినందించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

జవహర్‌నగర్: ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. 26వ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళీ భిక్షపతి, నాయకులు బింగి సతీష్‌గౌడ్, సోమ నర్సింగ్‌రావుముదిరాజ్, రాజుయాదవ్, కళాకారులు గద్దం గిరి, రమేష్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మధుసూదననగర్ కమ్యూనిటీహాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తూ.. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. మధుసూదన్‌నగర్ వార్డు కార్యాలయాన్ని కాలనీకి అప్పగించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు బైరు అనిల్, రాముయాదవ్, కాలనీవాసులు సుబ్బారావు, చంద్రశేఖర్, సుదర్శన్ పాల్గొన్నారు.

డెలివరీ బాయ్ ఆత్మహత్య

ఉప్పల్: డెలివరీ బాయ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉప్పల్ డివిజన్ కురుమానగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్న శ్రావణ్‌కుమార్ (24) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున తాను ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిక



ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

కీసర: కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరుతున్నారని మేడ్చల్ -మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం నర్సంపల్లి, తిమ్మాయిపల్లిలకు చెందిన పలువురు బీఆర్ఎస్, టీఆర్ఎస్ నేతలు ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ బలపడడంతో పాటు, అధికారంలోకి రావడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ విజయం ఖాయమన్నారు. పార్టీ బలోపేతానికి స్థానిక నేతలు కృషి చేయాలన్నారు. నర్సంపల్లి మాజీ ఉపసర్పంచ్ స్వప్న శ్రీనివాస్‌రెడ్డి, రామిడి బలవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కావలి నర్సింహ్మా, మేకల రాంరెడ్డి, తదితరులకు ఎంపీ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు బుద్ధిశ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట రెడ్డి అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



కీసర: కీసరగుట్ట రెడ్డి అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిడి విజయ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా బండారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుర్రం వరకాంత్‌రెడ్డి, బలిజోనిబావి అంజిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పన్నాల చిన్నబాల్‌రెడ్డి, బలిజోనిబావి రాజిరెడ్డి, కందాడి రామ్‌గోపాల్‌రెడ్డి, సలహాదారులుగా పన్నాల బుచ్చిరెడ్డి, నల్లవెంకట్ రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, సింగిరెడ్డి బాలకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామిడి విజయ్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానన్నారు. రెడ్డి అసోషియేషన్ కీసరగుట్ట ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు గుర్రం బస్వారెడ్డి, సంఘం సభ్యులు రామిడి పుల్లారెడ్డి, సుంకరికృష్ణారెడ్డి, బలిజోని బావి రఘుపతి రెడ్డి, ఎడ్ల ప్రశాంత్‌రెడ్డి, మేకల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోరాటంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 200వ వారం పూలమాల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బాల్‌రాజ్‌ముదిరాజ్, నాగరాజ్‌ముదిరాజ్, అంజిరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, దాసు, మల్లేశ్, దేవేందర్ ముదిరాజ్, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

ముగిసిన మహంకాళి ఆలయ కుంభాభిషేకం





అమ్మవారిని దర్శించుకున్న తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: రాంపల్లిలోని మహంకాళి దేవాలయ 12వ పుష్కర వార్షికోత్సవ కుంభాభిషేక మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు రాంమూర్తి శర్మ, గణపురం రాంప్రసాద్‌శర్మ, శ్యామ్‌సుందర్‌శర్మ నేతృత్వంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీమహాకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు పంబాల సరితారమేష్, నాగేష్‌గౌడ్, మహంకాళి దేవస్థానం చైర్మన్ ఎలసాని భూమయ్యయాదవ్, ఆలయ కమిటీసభ్యులు, గ్రామపెద్దలు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.